



● తాంసి కొనుగోలు కేంద్రంలో పట్టుకున్న జొన్న బస్తాలు

కొనుగోలు కేంద్రాల్లో.. దళారీ గద్దలు

- జిల్లాలో తరచుగా పట్టుబడుతున్న జొన్న దిగుబడులు
- మహారాష్ట్ర నుంచి జిల్లాకు అక్రమంగా రవాణా
- అధికారుల కనుసన్నల్లోనే కొనుగోలు కేంద్రాలకు తరలింపు
- తాజాగా తాంసి మండలంలో 136 క్వింటాళ్ల జొన్న బస్తాల సీజ్
- జిల్లా సరిహద్దులపై కరువవుతున్న అధికారుల నిఘా
- కొనుగోలు కేంద్రాలలో రోజుల తరబడి అన్నదాతల పడిగాపులు

ఆదిలాబాద్, మే 13(ఆంధ్రజ్యోతి): జొన్న పంట కొనుగోళ్లలో దళారీ గద్దలు దోపిడీ దందాకు ఎగబడుతున్నారు. జిల్లాలో అక్రమంగా అమ్మేందుకు నిల్వ చేసిన జొన్న పంట దిగుబడులు తరచూ పట్టుబడుతూనే ఉన్నాయి. గత కొద్దిరోజుల క్రితమే ఇచ్చోడ మండలం మాధాపూర్ గ్రామంలో 250 క్వింటాళ్ల జొన్నలు పట్టుబడ్డాయి. దీనిని మరిచిపోకముందే ఇంద్రవెల్లి మండలం హీరాపూర్‌లో 120 క్వింటాళ్లు, భీంపూర్‌లో 250 క్వింటాళ్ల జొన్నలను పట్టుకుని అధికారులు సీజ్ చేశారు. తాజాగా తాంసి మండలం కొనుగోలు కేంద్రంలో 136 క్వింటాళ్ల జొన్నలను అమ్మేందుకు ప్రయత్నించిన దళారీని రైతులు అడ్డుకోవడం చర్చనీయాంశంగా మారింది. దొరికితే దొంగ లేకపోతే దొర అనే చందంగా జొన్న పంట కొనుగోళ్లు జరుగుతున్నాయన్న విమర్శలు వస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా 16 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. క్వింటాలు మద్దతు ధర రూ.3371 చెల్లిస్తున్నారు. ఈ సారి లక్షా 10 వేల 901 ఎకరాలలో జొన్న పంట సాగైంది. దీంతో ఎకరాన 15 నుంచి 20 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు. ఈ లెక్కన జిల్లాలో లక్షా 71 వేల మెట్రిక్ టన్నుల దిగుబడులు వచ్చే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. అయితే బయట మార్కెట్ కన్న మద్దతు ధర ఎక్కువగా ఉండడంతో కొనుగోలు కేంద్రాలకు జొన్నలను భారీగా తరలిస్తున్నారు. కొనుగోలు కేంద్రాలకు జొన్నలు పోటెత్తడంతో అన్నదాతలు రోజుల తరబడి పంటను అమ్ముకునేందుకు పడిగాపులు కాయాల్సి వస్తుందని వాపోతున్నారు. ఇకనైనా దళారీ దందాకు అడుకట్ట వేస్తేనే అన్నదాతకు అవస్థలు తప్పుతాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మహారాష్ట్ర టూ ఆదిలాబాద్

కొందరు దళారులు మహారాష్ట్ర నుంచి జొన్నలను కొనుగోలు చేసి జిల్లా మార్కెట్‌కు తరలిస్తూ అమ్మేసుకుంటున్నారు. మహారాష్ట్రలో ప్రస్తుతం క్వింటాలు జొన్నలు రూ.2,200 ధర పలుకుతుంది. అవే జొన్నలకు జిల్లాకు తీసుకొచ్చి కొనుగోలు కేంద్రాలలో రూ.3371కి విక్రయిస్తున్నారు. దీంతో ఒక్కో క్వింటాలు వెనుక రూ.వెయ్యిలకు పైగా లాభాలను జేబులో వేసుకుంటున్నారు. అంటే వంద క్వింటాళ్లకు లక్ష రూపాయల వరకు సంపాదిస్తున్నారు. రాత్రికి రాత్రే జిల్లాకు జొన్నలను తరలిస్తున్న దళారులు మారుమూల గ్రామాల్లోని రైతుల ఇళ్లలో నిల్వ చేస్తున్నారు. అదును చూసి రైతుల పేరిట కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారు. ఇదంతా అధికారులకు తెలిసినా తెలియనట్లుగానే వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా పీఏసీఎస్ ఆధ్వర్యంలో సాగుతున్న కొనుగోలు కేంద్రాలు భారీ అక్రమాలకు అడ్డాలుగా మారుతున్నాయన్న విమర్శలు వస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా కొనుగోలు జరుగుతున్నట్లు తెలుస్తుంది.

క్వింటాలుకు రూ.100 కమీషన్

దళారులతో కుమ్మకవుతున్న కొంత మంది అధికారులు అడ్డగోలుగా కొనుగోళ్లకు అనుమతులు ఇస్తున్నారు. క్వింటాల్‌కు రూ.50 నుంచి రూ.100 దండుకుంటూ దళారులకు జొన్న పంటను అమ్ముకునేందుకు అవకాశం కల్పిస్తున్నారు. కొన్ని సొసైటీల్లో అక్రమమార్గంలో అధికారులు కమీషన్ దందాకు ఎగబడుతున్నారు. ప్రధానంగా ఇచ్చోడ, ఆదిలాబాద్, తాంసి, జైనథ్, ఇంద్రవెల్లి మార్కెట్ పరిధిలోని సొసైటీల్లో అడ్డగోలు దందాలకు ఎగబడుతున్నట్లు తెలుస్తుంది. ఇదంతా అధికారుల కనుసన్నల్లోనే నడుస్తున్నా.. ఏమీ తెలియనట్లు వ్యవహరిస్తున్నారు. ఇచ్చోడ సొసైటీ పరిధిలో పని చేస్తున్న ఓ అధికారి గతంలో కంది కొనుగోళ్లలో అక్రమాలకు పాల్పడి సస్పెండైనా.. ప్రస్తుతం



(తరువాయి 6వ పేజీలో...)

తగిన చర్యలు తీసుకుంటాం..

: గజానంద్, జిల్లా మార్కెటింగ్ అధికారి, ఆదిలాబాద్

కొనుగోలు కేంద్రాలకు అక్రమంగా జొన్నలను తీసుకొచ్చిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. తాంసి మండలంలో పట్టుబడ్డవి పాత జొన్నలుగా తెలిసింది. ఎవరు తీసుకొచ్చారో? అన్నదానిపై దర్యాప్తు జరుగుతుంది. జిల్లావ్యాప్తంగా ఈసారి 6 లక్షల క్వింటాళ్ల జొన్నలను కొనుగోలు చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు 2 లక్షల 18 వేల క్వింటాళ్లను కొనుగోలు చేయడం జరిగింది.



● తాంసి మండలంలో పట్టుకున్న జొన్నలతో అధికారులు, రైతులు



● ఇటీవల ఇచ్చోడ మండలంలో అక్రమంగా నిల్వ ఉంచిన జొన్నలను సీజ్ చేసిన అధికారులు, పోలీసులు



అర్ధ రాత్రి రోడ్డుపై బైఠాయించిన రైతులు

ఆ జొన్నలు ఎవరివి!?

● 136 క్వింటాళ్ల జొన్నలను పట్టించిన రైతులు
● పోలీసులకు ఫిర్యాదు ● నోరు మెదపని అధికారులు

తాంసి, మే 13(ఆంధ్రజ్యోతి): పది క్వింటాళ్లు కాదు.. ఇరవై క్వింటాళ్లు కాదు.. ఏకంగా 136 క్వింటాళ్ల మురిగిపోయిన జొన్నలను విక్రయించేందుకు ఆ వ్యాపారి సిద్ధమయ్యాడు. నేరుగా సంచుల్లోనే నింపి విక్రయించేందుకు సిద్ధం కాగా.. రైతులు పట్టుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు. అధికారులకు తెలిసినా.. పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. అసలు ఆ జొన్నలు ఎవరివి? జొన్నలు రవాణా చేసిన వాహనం ఎవరిది? అనే విషయం తెలియక పోవడంపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే...

తాంసి మండల కేంద్రంలో సహకార సొసైటీ ఆధ్వర్యంలో గత నెల రోజులుగా జొన్నలను కొనుగోలు చేస్తున్నారు. రోజుకు ఒకటి రెండు గ్రామాలను ఎంపిక చేసి కొనుగోలు చేశారు. అయితే సోమవారం రాత్రి ఓ మాక్స్ వాహనంలో జొన్న సంచులు దిగాయి. ఇవి ఎవరివి అని? ఆరా తీస్తే అందులో గత రెండు సంవత్సరాల క్రితం జొన్నలు ఉన్నాయి. వీటిని గమనించిన రైతులు నడిరాత్రి ఆందోళనకు దిగారు. దీంతో సంబంధిత శాఖ అధికారులు మంగళవారం అక్కడికి చేరుకుని పరిశీలించారు. వాహనం పట్టుబడ్డప్పటికీ ఆ జొన్నలు ఎవరివి? అనే విషయం తేలలేదు. దీంతో రైతులే నేరుగా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు సైతం ఆ వాహనం ఎవరిది? అనే విషయంపై ఇంకా స్పష్టమైన సమాచారం ఇవ్వలేదు. దీంతో 136 క్వింటాల జొన్నలను సీజ్ చేసినట్లు తెలిసింది. అసలు ఆ జొన్నలు ఎవరివి? ఎవరి పేరున విక్రయించేందుకు సిద్ధం చేశారు? నేరుగా జొన్న సంచుల్లో ఎందుకు తీసుకువచ్చారు? అనే విషయంపై పలువురు పలు విధాలుగా చర్చించుకుంటున్నారు. వాస్తవానికి తాంసీలో కొనుగోలు చేస్తున్న జొన్నలు భీంపూర్, తాంసి మండలాల రైతులకు సంబంధించినవి అయి ఉండాలి. కానీ వేరే మండలాలకు సంబంధించిన రైతుల పేరిట కూడా విక్రయిస్తున్నట్లు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. తాంసి ఎస్ఐతో పాటు వ్యవసాయ శాఖ అధికారి, సహకార సొసైటీ సీఈఓలను వివరణ కోరేందుకు ప్రయత్నించగా.. వారు అందుబాటులో లేకపోవడం గమనారం. ఫోన్ చేస్తే కనీసం ఫోన్ కూడా రిసీవ్ చేసుకోలేకపోయారు. మొత్తం మీద జొన్నలు ఎవరివో? తేలాలని రైతులు పట్టుబడుతున్నారు. మరి ఈ అక్రమ జొన్నల విక్రయం ఎలాంటి సంఘటనలకు దారితీస్తుందో? వేచి చూడాల్సిందే..!!

ప్రశాంతంగా పాలిసెట్ అర్హత పరీక్ష

ఆదిలాబాద్ టౌన్, మే 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మంగళవారం నిర్వహించిన పాలిసెట్ అర్హత పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల 30 నిమిషాల వరకు పరీక్ష కొనసాగింది. 1102 మంది విద్యార్థుల కోసం మూడు కేంద్రాలను జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేశారు. నిమిషం ఆలస్యం నిబంధన కారణంగా ఉదయం పది గంటల నుంచే విద్యార్థులను లోనికి పంపించారు. విద్యార్థుల హాల్ టికెట్‌ను పరిశీలించి వారిని క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరం లోనికి అనుమతించారు. కాగా కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించారు. అలాగే 1102 మంది విద్యార్థులకు గాను 1026 హాజరై 76 మంది గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ రమేష్‌బాబు తెలిపారు. అదేవిధంగా వేసవి దృష్ట్యా కేంద్రాల్లో తాగు నీటితో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంత వాతావరణం కల్పించడం జరిగిందని పేర్కొన్నారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్ అర్బన్, మే 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బంగారుగూడ ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియట్ ప్రవేశాల కోసం ఈ నెల 20 వరకు ఆన్‌లైన్ ప్రక్రియ కొనసాగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదర్శ పాఠశాల, కళాశాలలో 4 గ్రూపులు (ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ) ప్రతి గ్రూపులో 40 సీట్లు మొత్తం 160 సీట్లు ఉన్నాయన్నారు. అదేవిధంగా దూర ప్రాంతాల నుంచి ప్రవేశం పొందే విద్యార్థులకు హాస్టల్ వసతి కూడా ఉందని తెలిపారు. ఈ ప్రవేశాలు విద్యార్థుల మార్కుల ఆధారంగా వారు కోరుకున్న క్రమంలో గ్రూపులు కేటాయించబడుతాయన్నారు. అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.



మాట్లాడుతున్న మండల వ్యవసాయ అధికారి అచ్చిరెడ్డి

పచ్చిరొట్టతో రైతులకు లాభం : ఏవో

బోథ్, మే 13(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రైతులకు పచ్చిరొట్టపై మంగళవారం మండల వ్యవసాయ అధికారి అచ్చిరెడ్డి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువు భూమికి పోషకాహారం అందిస్తుందని, రైతులకు లాభమని అన్నారు. రైతులు పచ్చిరొట్ట ఎరువులు తప్పనిసరిగా వినియోగించుకోవాలని కోరారు. పచ్చిరొట్ట వినియోగం వల్ల ఎదిగే మొక్కలకు చీడపీడల నివారణ కోసం ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. తెగుళ్ల నుంచి మొక్కను రక్షిస్తుందన్నారు. ఇక ప్రతీ రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. అన్ని రైతు వేదికలలో సంబంధిత గ్రామాల ఏఈఓలను కలిసి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ప్రతీ రైతు ఐడి కార్డు ఆధార్ కార్డు తీసుకొని అధికారులను కలవాలన్నారు. అయితే ఆధార్ కార్డుకు లింకు ఉన్న ఫోన్ నెంబర్ కోసం మొబైల్ తీసుకువెళ్లాలన్నారు. ఇక నుంచి ప్రతీ సోమవారం సోనాల, పాట్నాపూర్ గ్రామాల రైతులకు అవగాహన సదస్సు ఉంటుందన్నారు.

కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలి

● అధికారులకు జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆదేశం ● బేల మార్కెట్ యార్డులో జొన్నల కొనుగోలు కేంద్రం సందర్శన ● సమస్యలపై ఆరా



రైతులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా



అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతూ..

బేల, మే 13(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని మార్కెట్ యార్డులోని జొన్నల కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం జిల్లా కలెక్టర్ రాజర్షి షా సందర్శించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు, జొన్నల కొనుగోలు ప్రక్రియ ఈనెల చివరి నాటికి, జూన్ మొదటి వారంలో తప్పనిసరిగా పూర్తి చేయాలన్నారు. హమాలీల కొరత, లారీల కొరత తదితర సమస్యలపై ఆరా తీశారు. వెంటనే సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ ఈ సందర్భగా పేర్కొన్నారు. అంతేకాకుండా ఈ ఏడాది జొన్న పంట అధికంగా వేయడం జరిగిందని, పెద్దమొత్తంలోనే పంట పండించడం జరిగిందని అన్నారు. వేరే రాష్ట్రం నుంచి మన జిల్లాకు జొన్నలు రాకూడదని, మన జిల్లా రైతులకు మాత్రమే జొన్న కొనుగోలు చేయాలన్నారు. దళారులు ఎవరైనా వేరే రాష్ట్రం నుంచి జొన్నలు తీసుకునివస్తే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, డీసీఓ మోహన్ నాయక్, సంబంధిత అధికారులు, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్ల అందజేత

ఆదిలాబాద్ అర్బన్: రెసిడెన్షియల్ ఇంటర్మీడియట్ కళాశాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ రాజర్షిషా విద్యార్థులకు సర్టిఫికేట్స్ ప్రధానం చేశారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ విద్యార్థులకు సర్టిఫికెట్ ఆఫ్ అప్రిసియేషన్ అందించి అభినందించారు. వివిధ మేనేజ్‌మెంట్లలో మహాత్మా జ్యోతిబాపూలే సాంఘీక సంక్షేమ గిరిజన సంక్షేమ మైనార్టీ సంక్షేమ కళాశాలలో ఎంపీసీ, బైపీసీలలో జిల్లా స్థాయిలో నిలిచిన 11 మంది విద్యార్థులకు వీటిని అందజేశారు. ఇందులో డీఐఓ, డీఐఈఓ, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినికి సర్టిఫికెట్‌ను అందజేస్తున్న కలెక్టర్ రాజార్షిషా

వ్యాయామం అలవాటు ఉత్తమ లక్షణం

● నేరడిగొండ పోలీస్‌స్టేషన్‌లో పిల్లల పార్కును ప్రారంభించిన ఎస్పీ

నేరడిగొండ, మే 13 (ఆంధ్రజ్యోతి): చిన్ననాటి నుంచి వ్యాయామ లక్షణం అలవర్చుకోవడం ప్రతీఒక్క విద్యార్థినీ, విద్యార్థికి ఉత్తమ లక్షణమని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. మంగళవారం నేరడిగొండ పోలీస్ స్టేషన్ అవరణలో ప్రత్యేకంగా చిన్నపిల్లల పార్కును జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్ ఐపీఎస్ కలిసి ప్రారంభించారు. పిల్లలకు ఆటవిడుపుగా ఉండే విధంగా చిల్డ్రన్ పార్కును ప్రారంభించడం జరిగింది. మొదటగా చిన్నారుల కరతాల ధ్వనుల మధ్య జిల్లా ఎసీఁకి స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ క్వార్టర్స్‌లో నివసించే పిల్లలే కాకుండా బయటి విద్యార్థులు ఈ చిల్డ్రన్ పార్కులో ప్రతీరోజు ఆటలను ఆడుతూ, వ్యాయామం చేస్తూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో చిన్న పిల్లలతో పార్కును ప్రారంభించి వారితో కొంత సమయాన్ని కేటాయించి గడపడం జరిగింది. పిల్లలతో సంభాషిస్తూ నిరంతరం విద్యపై ఆసక్తిని పెంపొందించుకుంటూ ఆటలను సైతం ఆడుకుంటూ జీవితాన్ని ఆనందోత్సాహాలను గడపాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్ ఐపీఎస్, ఇచ్చోడా సీఐ ఈ భీమేష్, ఎస్సై ఎల్ శ్రీకాంత్, స్కూల్ విద్యార్థిని విద్యార్థులు, వారి అధ్యాపకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



● నేరడిగొండ పోలీసు స్టేషన్ ఆవరణలో పార్కును ప్రారంభిస్తున్న జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



చిన్నారుల ఆటలను పరిశీలిస్తున్న ఎస్పీ, పోలీసు అధికారులు



మాట్లాడుతున్న జిల్లా ఉద్యానవన అధికారి కె.సుధాకర్



హాజరైన రైతులు

పంటల సాగులో ఖర్చులు తగ్గించాలి.. ఉత్పత్తి పెంచాలి : జిల్లా అధికారి

ఉట్నూర్, మే 13(ఆంధ్రజ్యోతి): పంటలు పండించడంలో రైతులు మెళకువలు పాటిస్తూ ఖర్చులు తగ్గిస్తూ ఉత్పత్తి పెంచేలా కృషి చేయాల్సిన అవసరం ఉందని జిల్లా ఉద్యానవన అధికారి కె.సుధాకర్ అన్నారు. మంగళవారం మండలంలోని దంతన్‌పల్లి రైతు వేదికలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతాంగానికి కష్టపడే తత్వం ఉన్నప్పటికి ఆరోగ్యం కూడా చూసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రైతులు ప్రతిరోజు పౌష్టికరమైన కూరగాయలు ఆకుకూరలు భోజనం చేయాలని సూచించారు. ప్రజల డిమాండ్‌ను బట్టి ప్రజల అవసరాల మేరకు కూరగాయలు పండించాలని కోరారు. ప్రతియేటా పంట మార్పిడి విధానం పాటిస్తూ ముందుకు వెళితే భూసారం భద్రంగా ఉంటుందన్నారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఆయిల్‌ఫామ్ తోటల సాగు వల్ల నాలుగేళ్లు కష్టపడితే మూడు దశాబ్దాల పాటు పలసాయం అందుబాటులోకి వస్తుందని అన్నారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ మంజులత మాట్లాడుతూ మన ఆరోగ్యం ఎంత ముఖ్యమో పంటలకు నేల ఆరోగ్యం కూడా అంతే ముఖ్యమన్నారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పాటు చేసుకోవడం వల్ల రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభిస్తుంది అన్నారు. పంటలకు తక్కువ యూరియా వాడుతు సాగుఖర్చులను తగ్గించుకోవాలన్నారు. అవసరం మేరకే రసాయనాలను వినియోగించాలని, తద్వారా పర్యావరణం కాపాడిన వారం అవుతామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు డాక్టర్ హరిప్రియ, డాక్టర్ సందీప్, సీహెచ్ ప్రశాంత్, మండల వ్యవసాయ అధికారి రమేష్ గిత్తేలతో పాటు ఏఈఓలు సాయి, సుధాకర్, నాగోరావు, మంగ, సంధ్యారాణి, తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఆకలి తీర్చడం అభినందనీయం

● తహసీల్దార్ సుభాష్ చంద్ర

బోథ్, మే 13(ఆంధ్రజ్యోతి): కష్టపడి రైతులు పండించిన పంటను అమ్ముకోవడానికి మార్కెట్‌కు వచ్చిన రైతులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని తహసీల్దార్ సుభాష్ చంద్ర, మార్కెట్ కమిటీ చైర్మన్ బి.గంగారెడ్డిలు పేర్కొన్నారు. మంగళవారం జొన్న పంట అమ్ముకునేందుకు వచ్చిన రైతులకు మార్కెట్ యార్డులో అన్నదాన కార్యక్రమాన్ని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జి.రాజు యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యక్రమాన్ని ప్రారంభించి రైతులకు అన్నం వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఆరు రోజులుగా రైతుల ఆకలి తీర్చాలన్న ఆలోచనతో చేపట్టిన కార్యక్రమం అభినందనీయమని పేర్కొన్నారు. మార్కెట్‌కు వచ్చిన ఏ రైతు ఆకలితో ఉండకూడదన్న ఉద్దేశంతో చేపట్టిన కార్యక్రమం ఇతరులకు ఆదర్శంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ అబ్రార్, సొసైటీ డైరెక్టర్ పోతన్న, కాంగ్రెస్ పార్టీ నాయకులు షేక్ అబూద్, గడ్డల నారాయణ, భోజన్న, తదితరులు ఉన్నారు.



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న తహసీల్దార్, ఏఎంసీ చైర్మన్లు

వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారుల సూచనలను పాటించాలి : కలెక్టర్

బేల, మే 13(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారుల సూచనలు పాటిస్తూ పంట సాగులో మంచి దిగుబడులు సాధించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సూచించారు. మండలం సిర్సన్నలో మంగళవారం ఏర్పాటు చేసిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పంట సాగులో పాటించాల్సిన సస్యరక్షణ చర్యలు, ఎరువులు, మందుల వినియోగం తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. అన్నదాతల సందేహాలను శాస్త్రవేత్తలు నివృత్తి చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సాయి తేజ, మండల ఉద్యానవన అధికారి అలేఖ్య, మండల పశుసంవర్ధక అధికారి డాక్టర్ శ్రవణ్ కుమార్, మండల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

తాంసిలో బుద్ధ జయంతి వేడుకలు

తాంసి, మే 13(ఆంధ్రజ్యోతి): బుద్ధ జయంతి వేడుకలను మంగళవారం మండల కేంద్రంలో ఘనంగా జరుపుకున్నారు. బుద్ధుని చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేసి నివాళులు అర్పించారు. అనంతరం గ్రామంలోని పలు వీధుల గుండా బుద్ధ వచనాలు చదువుతూ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం వృద్ధులకు పండ్లు స్వీట్లు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో సంఘం సీనియర్ ప్రతినిధి భగత్ మల్లాజీ, కామెరి గంగారం, భగత్ విలాస్, ముట్టిపోసులు, యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ఫిట్‌నెస్‌పై అవగాహన

ఆదిలాబాద్ అర్బన్, మే 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు పాఠశాల, కళాశాల యజమాన్యం, బస్సుల డ్రైవర్లు, సహాయకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ రవీందర్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారికి ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు అందజేయడంతో పాటు రోడ్డు, పిల్లల భద్రతకు సంబంధించిన విద్యా సంస్థల బస్సులపై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో జిల్లా రవాణ అధికారి ఎస్.శ్రీనివాస్, ఇతర ఎంవీఐలు, ఏఎంవీఐలు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



పేదవారి పెళ్లికి ఆర్థిక సహాయం అందజేస్తున్న గజానంద్ నాయక్

పదవి ఉన్నా.. లేకున్నా.. ప్రజలు బాగుండాలి

● మాజీ సర్పంచ్ బి.గజానంద్ నాయక్

నార్నూర్, మే 13(ఆంధ్రజ్యోతి): పదవులు ముఖ్యం కాదని, పదవి ఉన్నా.. లేకున్నా.. ప్రజలు బాగుండాలని నార్నూర్ మాజీ సర్పంచ్, గిరిజన నాయకుడు బి.గజానంద్ నాయక్ అన్నారు. మండలకేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పేద వారికి నేను ఉన్న అనే భరోసా, ధైర్యం ఇచ్చే నాయ కులు చాలా తక్కువ ఉంటారని, ఆర్థిక సమస్యతో పీడిస్తున్న కుటుంబాలు ఎన్నో ఆశల కొద్ది ఎదురు చూస్తారన్నారు. అలాంటి వారికి ఏదైనా రూపం లో ఆర్థికంగా చేయూతను అందించేందుకు ఎల్లప్పుడూ ముందు ఉంటానని ఆయన అన్నారు. దివంగత ప్రధాని వాజ్‌పేయి మాటలే తనలో మార్పునకు నిదర్శనమని అన్నారు. గ్రామంలో ప్రజల అభివృద్ధి తన ముందున్న ఏకైక లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

ఏజెన్సీ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి

● ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలు



నార్నూర్ ఎంపీడీవోకు ఫిర్యాదు చేస్తున్న ఆదివాసీ నాయకులు

నార్నూర్ రూరల్, మే 13(ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంత మండలాలలో పూర్తిగా ఏజెన్సీ చట్టాలు అయిన 1/70, పెసా, 5వ షెడ్యూల్డ్‌ని పకడ్బందీగా అమలు చేయాలని, ఈ ప్రాంతంలో 1970కి ముందు ఉన్న ఎస్సీ, ఎస్టీలకు అన్ని హక్కులు కల్పించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నైతాం బాలు అన్నారు. మండల కేంద్రంలో ఈ విషయమై తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలలో ఆదివాసీలు పలు అంశాలపై మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కావాలని ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా పని చేస్తోందని ఆరోపించారు. అలాగే, అధికారులు కూడా పని చేస్తున్నారన్నారు. సంబంధిత అంశాలపై జిల్లా కలెక్టర్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కూడా చాలా సార్లు ఫిర్యాదు చేశామని, అయిన వారిపై ఎలాంటి చట్టపరంగా చర్యలు లేవు అంటే ఏంటి అని ప్రశ్నించారు. గత కొన్ని నెలల క్రితం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆదివాసీ నేతల సమావేశం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసి ఏజెన్సీ సమస్యలు పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అయినా ఇక్కడి అధికారుల పనితీరు మారడం లేదన్నారు. ఆదివాసీల పట్ల నిర్లక్ష్యం చేస్తే పెద్దఎత్తున ధర్నా కార్యక్రమం చేస్తామని స్పష్టం చేశారు. నార్నూర్ ఎంపీడీవో కార్యాలయంలో ఓ పైస్థాయి అధికారి ఆదివాసీ గిరిజనుల పట్ల అన్యాయం చేస్తూ.. గిరిజనేతరులకు మద్దతు పలుకుతున్నారని ఆరోపించారు. సదరు అధికారిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. వెంటనే ఆ అధికారిని బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. విద్య, వైద్య, ఉపాధి పరంగా ఆదివాసీలు దూరంగా ఉన్నారని, కేవలం అధికారం కోసం ప్రభుత్వం మాకు హామీలు ఇస్తూ.. తమను తప్పుదోవ పట్టిస్తున్నారని విమరించారు. ఇందిరమ్మ ఇళ్ల పేరిట కమిటీ ఏర్పాటు చేసి ఆదివాసీలు వ్యతిరేకంగా గిరిజనేతరులను సభ్యులుగా నియమించి ఇక్కడ గొడవలు అయ్యే పరిస్థితి తెచ్చిందన్నారు. జిల్లా కలెక్టర్ వెంటనే ఇందిరమ్మ కమిటీ రద్దు చేసి ప్రభుత్వ అధికారుల ద్వారా సర్వే చేసి పేద ఎస్సీ, ఎస్టీలకు ఇళ్లు కేటాయించాలని అన్నారు. ఇక్కడి అధికారులకు ఏదైనా సమస్యపై దరఖాస్తు చేస్తే.. సంవత్సరం అయిన ఇప్పటికీ ఎలాంటి చర్యలు లేకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సెడిమకే రామరావు, మండల అధ్యక్షుడు పూసాం ఇస్రు, ఆదివాసీ సంక్షేమ పరిషత్ ప్రధాన కార్యదర్శి జైతు, నాయకులు అర్క గోవింద్, తొడశం ఇంద్రు,మహిళలు, యువకులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి పేదలకు ఒక వరం

నేరడిగొండ, మే 13(ఆంధ్రజ్యోతి): సీఎం సహాయ నిధి పేదలకు ఒక వరం లాంటిదని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. బోథ్ మండలంలోని మందబోగడ గ్రామానికి చెందిన పెంట లక్ష్మీకి రూ.26 వేల విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కును మంగళవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నేరడిగొండ మండల కేంద్రంలో గల తన నివాసంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో మహేందర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

భార్య లేక మనోవేదనకు గురై ఆత్మహత్య

బోథ్, మే 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని రేండ్లపల్లి గ్రామానికి చెందిన మెస్రం వెంకటేశ్వర్(31) మంగళవారం ఉదయం పంట చేనులో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి... మృతుడి భార్య గత ఏడేళ్ల క్రితం మృతి చెందింది. అయితే ఆయనకు ఇద్దరు ఆడ పిల్లలు ఉండడంతో వారిని పెంచి పోషిస్తున్నాడు. గత కొన్ని రోజులుగా ఒంటరితనంతో మనోవేదనకు గురవుతూ ఉన్నాడని మృతుడి తండ్రి సుదర్శన్ ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే మంగళవారం ఉదయం తన చేనుకు వెళ్లి ఇంటికి తిరిగి రాకపోవడంతో మృతుడి తమ్ముడు చేనులోకి వెళ్లాడు. అన్న మృతి చెంది ఉన్నాడని చూసి ఇంటికి సమాచారం ఇవ్వడం జరిగింది. దీంతో కుటుంబీకులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

జైనథ్, మే 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని కంటం గ్రామానికి చెందిన రావుత్ అమూల్ విశాఖపట్నం నౌకదళంలో విధులు నిర్వహిస్తున్న ఆయన భార్య ప్రణిత(19) ఇటీవల కామారెడ్డి దగ్గర రోడ్డు డివైడర్ ప్రమాదంలో మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి జోగు రామన్న మంగళవారం గ్రామానికి చేరుకుని మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. అలాగే మండలంలోని బాలాపూర్ గ్రామానికి చెందిన రావుత్ ప్రవీణ్ ఇటీవల గుండెపోటుతో మరణించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట ఆదిలాబాద్ మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌లు యాసం నర్సింగ్‌రావు, మెట్టు ప్రహ్లాద్, బాలాపూర్ మాజీ సర్పంచ్ జక్కుల వినోద్ యాదవ్, నాయకులు దీపక్, మహేందర్, కంటం, బాలాపూర్ గ్రామాల ప్రజలున్నారు.



మేడిగూడ కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పాయల శంకర్

మేలోనే జొన్నలను కొనుగోలు చేయాలి

జైనథ్, మే 13(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో వచ్చే నెల జూన్‌లో వ్యవసాయ పనులు ప్రారంభం నేపథ్యంలో ఈ నెల మేలోనే రైతులు పండించిన జొన్న పంటను పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ నాఫెడ్ మార్క్‌ఫెడ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జైనథ్ ఉమ్మడి మండలంలోని సాత్నాల పరిధిలో మేడిగూడ(ఆర్)లో చేపడుతున్న జొన్నల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి అధికారులు నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతుల సమస్యలను మాట్లాడి అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ జొన్న కొనుగోలుపై అసెంబ్లీలో మాట్లాడడంతో పాటు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌కు లిఖిత పూర్వకంగా విన్నవించడం జరిగిందన్నారు. జల్లాలో రైతులు పండించిన జొన్న పంట కొనుగోలుకు ప్రభుత్వం ముందుకు వచ్చిందన్నారు. ఆదిలాబాద్ నియోజకవర్గంలో ఇప్పటి వరకు 35 వేల క్వింటాళ్ల మాత్రమే కొనుగోలు చేసిందని అన్నారు. జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి జొన్న పంట కొనుగోలు కేంద్రాలను పెంచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మేడిగూడ సొసైటీ సీఈఓ శాలిక్‌రావ్, నాయకులు అస్తక్ సుభాష్, ఎల్టి అశోక్‌రెడ్డి, కుంచెట్టి సంతోష్, గాజుల సన్ని, శివలతో పాటు ఆయా గ్రామాల జొన్న రైతులు, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో దళారీ గద్దలు

(5వ పేజీ తరువాయి...)

ఆయనే జొన్న కొనుగోళ్లలో కీలకంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తుంది. తాజాగా తాంసి సొసైటీ పరిధిలోని కొనుగోలు కేంద్రానికి ఓ దళారీ భారీగా జొన్నలను తరలించడంతో అధికారుల పాత్రపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అక్రమంగా తరలిస్తున్న పంట దిగుబడులను పట్టుకోవడం, నామమాత్రంగా కేసులు చేస్తూ వదిలేయడంతో దళారీ దందాకు అడ్డుకట్ట పడడం లేదంటున్నారు.

రైతులే అడ్డుకున్నారు..

తాంసి కొనుగోలు కేంద్రంలో ఇటీవల 136 క్వింటాళ్ల జొన్న బస్తాలను పట్టుకుని సీజ్ చేశారు. అక్రమంగా అమ్మేందుకు ప్రయత్నించిన దళారీని రైతులే అడ్డుకుని అధికారులకు అప్పగించారు. అంటే కొనుగోలు కేంద్రాలలో అధికారుల నిఘా ఎలా ఉందో తెలుస్తునే ఉంది. అయిన ఇప్పటి వరకు అసలు సూత్రధారులు ఎవరన్నది అంతుచిక్కడం లేదంటున్నారు. రెడ్ హ్యాండెడ్‌గా జొన్న బస్తాలు, ఓ టాటా మ్యాజిక్ వ్యాన్‌ను పట్టుకున్న ఇప్పటి వరకు దళారీ ఎవరన్నది అధికారులు నిర్ధారించలేక పోతున్నారు. అధికారులతో కుదిరినా ముందస్తు ఒప్పందం ప్రకారమే దళారీ జొన్న బస్తాలను కొనుగోలు కేంద్రానికి తరలించినట్లు తెలుస్తుంది. అడ్డంగా రైతులకు దొరికిపోవడంతో పత్తాలేకుండా పోయాడు. అయితే కొనుగోలు కేంద్రానికి అక్రమంగా జొన్న బస్తాలను తరలించిన దళారీ జిల్లా కేంద్రంలోని విద్యానగర్ కాలనీకి చెందిన వ్యక్తిగా అందరూ అనుమానిస్తున్నారు. అయినా అధికారులు అదుపులోకి తీసుకోక పోవడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

నామమాత్రంగానే తనిఖీలు

పొరుగు రాష్ట్రం నుంచి అనుమతులు లేకుండా ఎలాంటి పంట దిగుబడులను జిల్లాలోకి అనుమతించవద్దంటూ ప్రభుత్వం పదేపదే చెబుతున్నా.. చెక్‌పోస్టు అధికారులు మాత్రం తేలికగానే తీసుకుంటున్నట్లు కనిపిస్తుంది. జిల్లా సరిహద్దుల్లో సరైన నిఘా లేకపోవడంతో అక్రమంగా పంట దిగుబడులను జిల్లాకు తరలిస్తున్నట్లు తెలుస్తుంది. బేల, బోరజ్, తలమడుగు, భీంపూర్, బోథ్, నార్నూర్ మండలాల మీదుగా జిల్లాలోకి అక్రమంగా పంట దిగుబడులను తరలిస్తు అమ్మేసుకుంటున్నారు. అలాగే ఓ మండలానికి చెందిన పంట దిగుబడులు మరో మండలంలో విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఒక కొనుగోలు కేంద్రం పరిధిలో మరో కొనుగోలు కేంద్రానికి సంబంధించిన జొన్నలను విక్రయించేందుకు వీలు లేదు. అయితే జైనథ్ మండలానికి సంబంధించిన పట్టా పాస్‌బుక్‌ల పై తాంసి కొనుగోలు కేంద్రంలో జొన్నలను విక్రయిస్తునట్లు తెలుస్తుంది. ఇదంతా నిబంధనలకు విరుద్ధమే అయినా.. సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

'జై బాపు జై భీం జై సంవిధాన్'లో కంది

ఆదిలాబాద్ అర్బన్, మే 13(ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా జన్నారంలో జరిగిన జైబాపు జై భీం జై సంవిధాన్ కార్యక్రమంలో ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరై శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడంతో పాటు పార్టీ పటిష్టతకు అందకరూ కలిసికట్టుగా పని చేయాలని సూచించారు. ఎమ్మెల్సీ దండె విఠల్,మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాలచారి పాల్గొన్నారు.

పాము కాటుతో విద్యార్థిని మృతి

నార్నూర్, మే 13 (ఆంధ్రజ్యోతి) : గాదిగూడ మండల కేంద్రానికి చెందిన కనక స్వప్న(17) పదో తరగతి విద్యార్థిని పాము కాటుతో మృతి చెందినట్లు గ్రామస్తులు, కుటుంబీకులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం ఇంట్లో పని చేస్తున్న సమయంలో పాము కాటు వేసింది. వెంటనే గాదిగూడ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లగా పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స నిమిత్తం ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందినట్లు తెలిపారు.

బోరిగాంలో పోలీసుల ఆధ్వర్యంలో ఫ్లాగ్ మార్చ్

ముథోల్, మే 13 (ఆంధ్ర జ్యోతి) : మండలంలోని బోరి గాంలో సోమవారం జరిగిన ఘటన నేపథ్యంలో జిల్లా ఎస్పీ జానకి షర్మిల ఆదేశాల మేర కు ముథోల్ సీఐ మల్లేష్ ఆధ్వ ర్యంలో మంగళవారం ఉద యం పోలీసులు ప్రజలకు భద్ర తపై భరోసా నింపడానికి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. గ్రామంలో ప్రధాన వీధుల గుండా భారీ సంఖ్యలో పోలీసులు ర్యాలీ నిర్వహించారు. గ్రామంలో ప్రజలకు శాంతి భద్రతల పరిరక్షణకు తాము ఉన్నామని పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ ద్వారా తెలియజేశారు. కార్యక్రమంలో ముథోల్ ఎస్సై సంజీవ్, ఆయా మండలాల ఎస్సైలు, పోలీసులు, శివంగి టీం పోలీసులు పాల్గొన్నారు.

'జీవన్‌జ్యోతి బీమా స్కీమ్‌ను వినియోగించుకోవాలి'

సారంగాపూర్, మే 13 (ఆంధ్రజ్యోతి) : ఎస్‌బీఐ బ్యాంకులో అకౌంట్ కలిగి ఉన్న లబ్ధిదారులందరూ ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి బీమా స్కీమ్‌ను సద్వినియోగం చేసుకోవాలని బ్యాంక్‌మేనేజర్ ప్రశాంత్ అన్నారు. మంగళవారం మండలంలోని జాందని గ్రామాలకు చెందిన లక్ష్మీనర్సవ్వలు కొన్నిరోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందగా బాధిత కుటుంబసభ్యులు ఒక్కొక్కరికి రూ.2 లక్షల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం లబ్ధిదారులకు అందిస్తున్న పథకాలను పొందాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిబ్బంది శ్రీకాంత్‌లతో పాటు లబ్ధిదారులు ఉన్నారు.

వ్యవసాయ భూమిని పరిశీలించిన తహసీల్దార్

నర్సాపూర్(జి), మే 13 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన సురేందర్ రెడ్డి తన సొంత భూమిలో ఎకరం నాన్ అగ్రికల్చర్‌గా మార్చేందుకు రిజిస్ట్రేషన్ స్లాట్‌బుక్ చేసుకున్నాడు. మంగళవారం సురేందర్‌రెడ్డి వ్యవసాయ భూమిని తహసీల్దార్ సోమ శ్రీనివాస్, గిర్దావర్ నవతజ్యోతి పరిశీలించారు. అనంతరం నాలా సర్టిఫికెట్ అందజేశారు.

అత్యాచార ఘటనలో నిందితుడికి పదేళ్ల జైలు

దిలావర్‌పూర్, మే 13 (ఆంధ్రజ్యోతి) : బాలికపై అత్యాచారానికి పాల్పడ్డ ఆటో డ్రైవర్ షేక్ సమీర్ అనే నిందితుడికి నిర్మల్ ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టు న్యాయాధికారి పది సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ. 3 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. వివరాలు... 2019లో మండలంలోని ఓ బాలికను నిర్మల్‌లో నివాసముంటున్న ఆదిలాబాద్‌లోని కుర్షిద్ నగర్‌కు చెందిన షేక్ సమీర్ అనే యువకుడు మాటల్లో పెట్టి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆ బాలిక విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలుపడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్సై సంజీవ్ పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్ చేశారు. కాగా కోర్టులో నేరం రుజువు కావడంతో నేరస్తుడు సమీర్‌కు నిర్మల్ ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టు ప్రత్యేక న్యాయాధికారి ఎస్. శ్రీవాణి పది సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ. 3 వేల జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పునిచ్చారు.

'గ్రామ సభలను వినియోగించుకోండి'

కుంటాల, మే, 13 : (ఆంధ్రజ్యోతి) : కుంటాల మండలం భూ భారతి పథకంలో పైలట్ ప్రాజెక్టులో ఎంపికైనందున రైతులకు సంబంధించిన అన్ని రకాల భూ సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామాలలో మరోమారు గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ కమల్‌సింగ్ తెలిపారు. మంగళవారం నిర్వహించిన గ్రామ సభల్లో రైతుల నుంచి అధికసంఖ్యలో దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్లు కమల్ సిం గ్, ఎజాజ్ అహ్మద్‌ఖాన్, ప్రవీణ్‌కుమార్‌లు పేర్కొన్నారు.

ముథోల్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల పోస్టర్లు విడుదల

ముథోల్, మే 13 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ కేంద్రమైన ముథోల్‌లోని పశుపతినాథ్ శివాలయం ఆవరణలో మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో కళాశాల పోస్టర్లు, స్టిక్కర్లను, బ్యానర్లను బీడీసీ నాయకులు, అధ్యాపకులు, విడుదల చేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరడానికి అవకాశం ఉందని కళాశాల అధ్యా పకులు తెలిపారు.

ఆటోను ఢీకొన్న లారీ : ఒకరి మృతి

● నలుగురికి తీవ్ర గాయాలు
● ఆసుపత్రికి తరలిస్తుండగా మహిళ మృతి
● బాధితులు నిజామాబాద్ జిల్లా వాసులు

దిలావర్‌పూర్, మే 13 (ఆంధ్రజ్యోతి) : భైంసా మండలం మాంజ్రి గ్రామంలో తమ సమీప బంధువు మృతి చెందడంతో నిజామాబాద్ జిల్లా మెండోరా గ్రామానికి చెందిన మహిళలు ఆటోలో అంత్యక్రియలకు హాజరయ్యారు. అంత్యక్రియలు పూర్తి కాగానే తిరిగి మెండోరా వెళ్తుండగా మంగళవారం రాత్రి దిలావర్‌పూర్ పాత బస్టాండ్ సమీపంలో వసీమ్ దాబా వద్దకు రాగానే నిర్మల్ వైపు నుంచి భైంసా వైపు వెళ్తున్న లారీ వేగంగా వచ్చి వీరు ప్రయాణిస్తున్న ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో కిష్టపు రపు గంగు(42), గోరక్ గౌరీ, గుండేటి లక్ష్మీ, ఆటోడ్రైవర్ అలిసాబ్ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని వెంటనే నిర్మల్ ఆసుపత్రికి తరలించారు. వీరిలో గంగు పరిస్థితి ఆందోళనకరంగా మారడంతో నిజామాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. ఈ ప్రమాదానికి లారీడ్రైవర్ అజాగ్రత్త, అతివేగమే కారణమని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. కాగా మృతురాలి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సందీప్ తెలి పారు.



మృతిచెందిన కిష్టపురపు గంగు

పందుల సమస్యలపై డివిజనల్ పంచాయతీ అధికారి సమావేశం

దిలావర్‌పూర్, మే 13 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో తీవ్రఅసౌకర్యానికి గురి చేస్తున్న పందుల సమస్యపై నిర్మల్ డివిజన్ పంచాయతీ అధికారి అజీజ్ ఖాన్ మంగళవారం విచారణ చేపట్టారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, పందుల పెంపకందారులతో సమావేశం నిర్వ హించారు. కాగా దిలావర్‌పూర్ మండల కేంద్రంలో విచ్చలవిడిగా తిరుగుతున్న పందులను అరికట్టేందుకు వీడీసీ సభ్యులు సోమవారం జరిగిన ప్రజావాణిలో నిర్మల్ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో డివిజనల్ పంచాయతీ అధికారి అజీజ్‌ఖాన్ మంగళవారం పందుల పెంపకందారులు, వీడీసీ సభ్యులతో కలిసి సమస్య పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. పందులకు షెడ్లు ఏర్పాటు చేసుకో వడానికి ప్రభుత్వ భూమిని కేటాయించాలని పందుల పెంపకందారులు కోరారు. పందుల పెంపకమే తమ జీవనాధారమని, వాటిని నిర్మూలిస్తే రోడ్డున పడతామని పేర్కొన్నారు. మరికొందరు వీడీసీ సభ్యులు, పందుల పెంపకందారులు సమావేశానికి రాకపోవడంతో చర్చలు అసంపూర్తిగా జరగడంతో మరోమారు ఈ నెల 15న సమావేశం నిర్వహించేందుకు నిర్ణయించారు. అప్పటి వరకు ఇరుపక్షాలు సంయమనం పాటించాలని డివిజనల్ పంచాయతీ అధికారి అజీజ్‌ఖాన్ సూచించారు. గ్రామస్థులతో పాటు పందుల పెంపకం దారులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.



విచారణ చేస్తున్న డివిజనల్ పంచాయతీ అధికారి

వ్యక్తి మృతదేహం లభ్యం

కుంటాల, మే, 13 : (ఆంధ్రజ్యోతి) : కుంటాల మండలం కల్లూరు వాగు సమీపంలో లిఫ్టిఇరిగేషన్ గదిలో మంగళవారం గుర్తుతెలియని మృతదేహం లభించింది. ఎస్ఐ అశోక్ కథనం మేరకు కల్లూరు వాగు సమీపంలో ఉన్నటువంటి గదిలో గత కొద్ది రోజుల క్రితం వ్యక్తి మృతిచెందాడు. అయితే ప్రతిరోజు మాదిరిగానే గ్రామస్తులు ఉదయం వాగు వైపు వెళ్లిన సమయంలో దుర్వాసన రావవడంతో స్థానిక పంచాయతీ సెక్రటరీకి సమాచారం అందించారు. సెక్రటరీ పోలీసులకు సమాచారం అందించగా అక్కడికి వచ్చి విచారణ చేపట్టగా మృతిచెందిన వ్యక్తి పేరు జక్కుల గజ్జారాం ఏపీనగర్, భైంసాకు చెందినవాడని ఇతను వారం రోజుల క్రితం మృతిచెందినట్లు గుర్తించారు. మృతునికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు ఈ మేరకు కేసు నమో దు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అదుపు తప్పిన ద్విచక్ర వాహనం

నర్సాపూర్(జి), మే 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అర్లి(కే) ఎక్స్ రోడ్ వద్ద ద్విచక్రవాహనం అదుపు తప్పి నలుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... దిలావర్‌పూర్ మండలం ఎల్లమ్మ ఆలయానికి వెళ్లి తిరిగి నిగ్వా స్వగ్రామానికి వెళ్తున్న తల్లిదండ్రులు, ఇద్దరు కుమారులకు తీవ్ర గాయాలు అయ్యాయి. తీవ్ర గాయాలైన వారిని 108లో భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదం వాహనం అదుపు తప్పడంతోనే జరిగిందని స్థానికులు చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నిర్మల్ రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ సరఫరాలో బుధవారం అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ అధికారులు మంగళవారం పత్రిక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతులు, నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు దృష్ట్యా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆదర్శనగర్ వాటర్ ట్యాంక్, జగదాంబ టెంపుల్, మహమ్మదీయ మజీద్ ఏరియాల్లో అంతరాయం ఉంటుందని తెలిపారు.

దాబాల్లో పోలీసుల ఆకస్మిక తనిఖీలు

నిర్మల్ రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి) : రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ఎటువంటి అనుమతి, పర్మిషన్ లేకుండా మద్యం తాగడానికి అనుమతిస్తున్న దాబాలపై మంగళవారం ఆకస్మిక తనిఖీ చేసినట్లు రూరల్ సీఐ కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ... ఉన్నతాధికారుల ఆదేశం మేరకు పోలీస్ స్టేషన్ పరిధిలో దాబాలపై ఎటువంటి అనుమతి, పర్మిషన్ లేకుండా మద్యం అమ్మడం లేదా మద్యం తాగడానికి అనుమతిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ తనిఖీల్లో రూరల్ ఎస్సై లింబాద్రి, పోలీసులు పాల్గొన్నారు.

దిలావర్‌పూర్ : మండలంలోని 61వ జాతీయ రహదారి పక్కన ఉన్న దాబాలపై మంగళవారం రాత్రి దిలావర్‌పూర్ ఎస్సై లోక సందీప్ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా మద్యం తాగుతున్న పలువురికి కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు. ఆ తర్వాత ఆహార పదార్థాలను తనిఖీ చేశారు. వాడుతున్న నూనెలను పరిశీలించారు. ఇకపై శుభ్రత పాటించాలని, నిల్వ పదార్థాలను కస్టమర్లకు వడ్డించ వద్దని, మద్య పానం సేవించరాదని హెచ్చరించారు. ఎవరైనా ఈ విషయాలు అతిక్రమిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని దాబాల యజమానులను ఎస్సై సందీప్ హెచ్చరించారు.

గుడుంబా స్థావరాలపై దాడి

కడెం, మే 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అల్లంపల్లి పంచాయతీ పరిధిలోని చింతగూడ గ్రామంలో గల గుడుంబా స్థావరాలపై జిల్లా ఎస్పీ జానకి షర్మిల ఆదేశాల మేరకు కడెం ఎస్సై కృష్ణ సాగర్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ప్రభుత్వ నిషేధిత గుడుంబా తయారీకి పాల్పడుతున్న అజ్మీరా దశరథ్ అనే వ్యక్తి ఇంట్లో 5 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకొని, గుడుంబా తయారీకి సిద్ధంగా ఉంచిన 200ల లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. కార్యక్రమంలో పోలీసులు ధన్‌రాజ్, శ్రీను, దేవన్న పాల్గొన్నారు.

వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన తహసీల్దార్



తనిఖీ నిర్వహిస్తున్న తహసీల్దార్ సోమశ్రీనివాస్

నర్సాపూర్(జీ), మే 13 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం మండల తహసీల్దార్ సోమశ్రీనివాస్ తనిఖీ చేశారు. ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించారు. కొనుగోళ్లలో వేగం పెంచి సూచించిన మిల్లులకు ఎప్పటి కప్పుడు ధాన్యాన్ని తరలించాలన్నారు. తూకం వేసిన ధాన్యం బస్తాలను ట్యాబ్‌లో పొందుపరచాలని నిర్వాహకులకు సూచించారు. రైతులు పట్టా పాస్‌బుక్, ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్ కాపీలను సెంటర్ ఇన్‌చార్జ్‌కు అందజేసి రైతులు బస్తాలను నమోదు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా రైతులు తేమ శాతం 11 ఉన్న వడ్లను కొనుగోలు చేయడం లేదని, సమస్యను తహసీల్దార్ దృష్టికి తీసుకువచ్చారు. హమాలీలు పదిహేను మంది ఉండటంతో వడ్లు తూకం చేయడం ఆలస్యం అవుతుందని, లారీ లోడ్ చేసి న తరువాత కూడా లారీ ఏ రైస్ మిల్లుకు వెళ్లాలో ట్యాగ్ కావడం లేదని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో గిర్దావర్ నవత జ్యోతి, నిర్వాహకులు పద్మ, సాయి ఉన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

● టీయూసీఐ రాష్ట్ర కార్యదర్శి కే.రాజన్న

దిలావర్‌పూర్, మే 13 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 20న జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్య దర్శి కే.రాజన్న అన్నారు. టీయూసీఐ ఆధ్వర్యంలో దిలావర్‌పూర్ మండలంలోని సిరా పూర్ బీడీ ఫ్యాక్టరీలో యాజమాన్యానికి మంగళవారం సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా కే. రాజన్న మాట్లాడుతూ... గత 11 సంవత్సరాల బీజేపీ ప్రభుత్వ పాలనలో కార్మికుల జీవన ప్రమాణాలు పడిపోయాయన్నారు. అన్ని రకాల వస్తువుల ధరలు పెరిగాయని, కార్మికుల వేతనాలు మాత్రం పెరగలేదన్నారు. కార్మికులకు ఉద్యో గ, ఆరోగ్య భద్రత కరువైందన్నారు. మోదీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్పొరేట్ కం పెనీల అనుకూల, కార్మిక వ్యతిరేక విధానాలే ఇందుకు కారణమన్నారు.సమ్మెలో జిల్లాలోని కార్మికులందరూ పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాజు, శ్యామ్ రావు, లక్ష్మీ, లక్ష్మణ్, మనోహర్, రాజేందర్, గంగాధర్, లింగన్న, తదితరులు పాల్గొన్నారు.

కోళ్లఫారం తొలగించాలని ఆందోళన



ఎంపీడీవో కార్యాలయం ఎదుట కాలనీవాసుల నిరసన

కడెం, మే 13 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని పెద్దూర్ పంచాయతీ పరిధిలో 4వ వార్డులో ఏర్పాటు చేసిన కోళ్లఫారంను తొలగించాలని గ్రామస్థులు కోరారు. మంగళవారం కడెం ఎం పీడీవో కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. కోళ్లఫారం వలన అనేక వ్యాధులు, అనారోగ్యానికి గురవుతున్నామని కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. అనేకసార్లు వినతి పత్రం అందించినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని వాపోయారు. ఇప్పటి కైనా కోళ్లఫారంను తొలగించాలన్నారు.


భైంసాలో హాల్ టికెట్లు తీసుకుంటున్న విద్యార్థినులు

నేటి నుంచి డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

● ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించేందుకు ప్రభుత్వ అంగీకారం

● సమ్మె విరమించిన ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు

భైంసా, మే 13 (ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం గాను ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు చేపట్టిన సమ్మెను విరమించాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వచ్చే మూడు రోజుల వ్యవధిలో బకాయిలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించిన దరిమిలా ప్రైవేట్ డిగ్రీ యాజమాన్యాలు గత నెల రోజులకు పైగా కాలం చేపట్టిన సమ్మెను విరమించాయి. డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు నిర్వహించేందుకు గాను ముందుకువచ్చాయి. సోమవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బకాయిల చెల్లింపుల ఆదేశాలు వెలువరించిన వెంటనే డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు ఇన్నాళ్ల వరకు చెల్లింపులు చేపట్టని విద్యార్థుల పరీక్షలు ఫీజులను ఆగమేఘాల పై చెల్లింపులను చేపట్టాయి. దీంతో రెండు పర్యాయాలు వాయిదా పడ్డ సెమిస్టర్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి.

● రెండు సార్లు పరీక్షలు వాయిదా

గత నెలలోనే డిగ్రీ పరీక్షలు పూర్తి కావాల్సి ఉంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయడం లేదని ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు పరీక్ష ఫీజులు చెల్లించడానికి ముందుకు రాలేదు. దీంతో విశ్వవిద్యాలయం అధికారులు గత నెల 21న నిర్వహించాల్సిన పరీక్షలను అదే నెల 28వ తేదీకి వాయిదా వేసారు. అయితే గత నెల 27 వరకు కాకతీయ యూనివర్సిటీ పరిధిలో మొత్తం 296 డిగ్రీ కళాశాలలు ఉండగా ఇందులో 156 కళాశాలలు మాత్రమే పరీక్ష ఫీజులు చెల్లించాయి. మిగతా కళాశాలలు పరీక్ష ఫీజులు చెల్లించకపోవడంతో విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య రాజేందర్ రెండో మారు డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేసారు. తాజాగా సోమవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బకాయిలు చెల్లింపులకు సంబంధించి స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడంతో స్పందించిన ప్రైవేట్ డిగ్రీ కళాశాల యాజమాన్యాలు పరీక్ష ఫీజులను చెల్లించడంతో సెమిస్టర్ పరీక్షల నిర్వాహణపై నెలకొన్న ప్రతిష్టంబనలు తొలగిపోయాయి.

● ఆలస్యంగా హాల్ టికెట్ల విడుదలతో విద్యార్థుల అవస్థలు

బుధవారం నుంచి ప్రారంభమయ్యే డిగ్రీ సెమిస్టర్ పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లను కాకతీయ యూనివర్సిటీ అధికారులు మంగళవారం సాయంత్రం వేళలో విడుదల చేశారు. పరీక్షల షెడ్యూల్ విడుదలైనప్పటికి హాల్ టికెట్ల విడుదలలో జాప్యం జరుగడటంతో పరీక్షలు జరుతాయో లేదోన్న ప్రతిష్టంబన ఏర్పడింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వేళ వరకు డిగ్రీ విద్యార్థులు పరీక్షల హాల్ టికెట్ల కోసం గాను తాము చదువుకుంటున్న కళాశాలల వద్ద ప్రదక్షిణలు చేస్తూ ఎదురు చూసారు. ఎట్టకేలకు 3.30 గంటల ప్రాంతంలో హాల్ టికెట్లను ఆన్‌లైన్‌లో విడుదల చేశారు.

ఆంధ్రజ్యోతి పరిశీలన


అధ్వానంగా మారిన తలమడుగు నుంచి గుట్టపైకి వెళ్లే రహదారి


ఇబ్బందులు పడుతూ ఎడ్లబండితో గుట్టపైకి వెళుతున్న రైతులు


శ్రమదానంతో రోడ్డును బాగు చేసుకుంటున్న రైతులు

హామీలకే పరిమితమైన బీటీ రోడ్డు నిర్మాణం

● ఎడ్లబండి కూడా వెళ్లలేని స్థితిలో రోడ్డు ● ప్రతీ సంవత్సరం శ్రమదానంతో రోడ్డు బాగు చేసుకుంటున్న రైతులు ● గుట్టపైన మూడు వేల ఎకరాల సాగు భూమి.. రైతుల ఆందోళన

తలమడుగు, మే 13 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధి కోసం, రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయల నిధుల మంజూరు చేస్తున్నామని చెప్తున్నప్పటికీ కొంతమంది అధికారుల నిర్లక్ష్యంతో అవి సక్రమంగా అమలు కావడం లేదని సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అదిలాబాద్ జిల్లా తలమడుగు మండల కేంద్రానికి ఆనుకొని ఉన్న తలమడుగు గుట్ట రోడ్డు నిర్మాణం కోసం రైతులు దశాబ్దాల నుంచి అధికారులకు ప్రజాప్రతినిధులకు పలుమార్లు విన్నవించిన రోడ్డు నిర్మాణం కోసం హామీలు ఇస్తున్నారు తప్ప అమలుపరచడం లేదని సర్వత్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తలమడుగు గుట్టకు తలమడుగు గ్రామానికి ఆనుకొని ఉన్న గుట్టపైన ఏడు గ్రామాలకు సంబంధించిన శివారు ప్రాంతంలో దాదాపు 3 ఎకరాల వ్యవసాయ సాగుభూమి ఉన్నప్పటికీ రైతులకు సరైన రోడ్డు మార్గం లేక దశాబ్దాల నుంచి రాళ్లను రప్పలను దాటుతూ వ్యవసాయం సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. తలమడుగు గుట్టపైన ఝరి, చర్లపల్లి, బరంపూర్, సకినాపూర్, డోర్లి, నడిమ్ పల్లె, తలమడుగు తదితర గ్రామాలకు చెందిన రైతుల వ్యవసాయ భూములు ఉన్నాయి. రైతులు వాటిని సాగు చేసుకుంటూ జీవనము సాగిస్తున్నారు. అదేవిధంగా గుట్ట పక్కన ఆదివాసి గిరిజన గ్రామమైన. చర్లపల్లి గ్రామానికి చెందిన రైతులు ఎక్కువమంది ఉన్నారు. తలమడుగు నుంచి గుట్టపై నుంచి చర్లపల్లి గ్రామం వరకు బీటీ రోడ్డు నిర్మాణం చేపడితే ఆయా గిరిజన గ్రామాలతో పాటు రైతులకు. ఇంతగానో ఉపయోగపడుతుందన్నారు. గుట్ట పైన వ్యవసాయ భూమి ఉన్నప్పటికీ రోడ్డు సౌకర్యం లేక. కొంతమంది రైతులు కౌలుకు ఇచ్చేస్తున్నారు. మరి కొంత మంది రైతులు అలాగే వదిలి పెడుతున్నారు. గత ఎన్నికల సమయంలో రోడ్డు నిర్మాణ చేపడతామని కొంతమంది ప్రజాప్రతినిధులు హామీ ఇచ్చారు తప్ప ఇప్పటివరకు రోడ్డు నిర్మాణంపై పట్టించుకోవడంలేదని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అరుగాలం పండించిన పంటను ఇంటికి తెచ్చేందుకు రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి సంవత్సరం రైతులంతా కలిసి శ్రమదానంతో రోడ్డును బాగు చేసుకుంటున్నారు. రోడ్డు సక్రమంగా లేకపోవడంతో ఎన్నో ప్రమాదాలు జరిగాయన్నారు. గతంలో ఎడ్ల బండ్లు బోల్తా పడి రైతులకు, పశువులకు గాయాలు అయ్యాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశా రు. ఇకనైనా అధికారులు స్పందించి తలమడుగు గుట్టకు బీటీ రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయా లని చర్లపల్లి తలమడుగు. గ్రామాలకు చెందిన రైతులు కోరుతున్నారు.

● రోడ్డు లేక ఇబ్బందులు



గుట్టపైన వ్యవసాయం సాగు చేసే భూమి ఉన్నప్పటికీ రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నాం. రోడ్డు నిర్మించాలని గత 50 ఏళ్ళ నుంచి ప్రభుత్వాలకు విన్నవిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. రోడ్డు సక్రమంగా లేకపోవడంతో ఎడ్ల బండ్లు బోల్తా పడి తీవ్ర గాయాలు అయ్యాయి.

● మేకల సద్దాం యాదవ్, రైతు, తలమడుగు

కొనుగోళ్లు వేగవంతం చేయాలి

కుంటాల, మే, 13 (ఆంధ్రజ్యోతి) : అకాల వర్షాల కారణంగా రైతులు పండించిన ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని డీఏవో అంజిప్రసాద్ అన్నారు. మంగళవారం మండల కేంద్రం కుంటాలలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు.

దరఖాస్తుల వివరాలు తెలుసుకున్న లీడ్ బ్యాంక్ మేనేజర్

ముథోల్, మే 13 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసానికి వచ్చిన దరఖాస్తులకు సంబంధించిన వివరాలను బుధవారం లీడ్ బ్యాంక్ మేనేజర్ రాం గోపాల్ ఎంపీడీవో శివకుమార్‌కు అడిగి తెలుసుకున్నారు. మండలా భివృద్ధి కార్యాలయంలో బ్యాంకుల వారీగా వచ్చిన దరఖాస్తుల వివరాలను సేకరించారు. మండలంలోని 19 గ్రామ పంచాయతీల నుంచి 1316 మంది దరఖాస్తులు చేసుకున్నట్లు ఎంపీడీవో శివకుమార్ తెలిపారు. మండలాభివృద్ధి కార్యా లయంలో అందజేసిన వాటిని సిబిల్ వెరిఫికేషన్ కోసం సంబంధిత బ్యాంకులకు పంపించామని ఎంపీడీవో వివరించారు.

పచ్చదనం పరుచుకున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు


పచ్చదనంతో నిండిన దంతన్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం


..హస్నాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం


.. శ్యామ్‌పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

ఉట్నూర్, మే13 (ఆంధ్రజ్యోతి):" మనసుంటే మార్గం ఉంటుంది " అన్నట్లుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు నాటి నుంచి నేటి వరకు పని చేస్తున్న వైద్య సిబ్బంది కృషి వల్ల ఉట్నూర్ మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు పచ్చదనం పరుచుకున్నాయి. ఉట్నూర్ మండలంలోని దంతన్‌పల్లి, హస్నాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో గతంలో పని చేసిన డాక్టర్ జాదవ్ వసంతరావు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆవరణలో మొక్కలు పెంపకానికి శ్రీకారం చుట్టారు. ఆ తర్వాత దంతనపల్లి ప్రాథ మిక ఆరోగ్య కేంద్రానికి వచ్చిన డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి కోవ అనురాధా సైతం మొక్కల పెపంకానికి ప్రా ధాన్యం ఇవ్వడంతో పాటు గతంలో పెంచిన మొక్కలను కాపాడడంలో సఫ లీకృతులయ్యారు. షాంపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి గతంలో పని చేసిన డాక్టర్ ఫల్గున్‌కుమార్ ఆధ్వర్యంలో మొక్కల పెంపకానికి శ్రీకారం చుట్టారు. నాటి మొక్కలే నేటి వరకు ఎదిగి పచ్చదనం నిండుకోవడంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకు వస్తున్న రోగులకు ఆహ్లాదం కలిగిస్తుంది. ప్రస్తుతం ఉన్న డాక్టర్ రాథోడ్ సందీప్‌కుమార్ సైతం ప్రాథమిక ఆరోగ్య కేం ద్రంలో ఉన్న మొక్కలను కాపాడుకుంటు వస్తున్నారు. ఉట్నూర్ మండలంలో దంతన్‌పల్లి, హస్నాపూర్,షాంపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను చూస్తే హరిత వనాలతో నిండి పోయి పచ్చదనం పరుచుకుని రోగులకు సేద తీరు స్తున్నాయి. కృషి ఉంటే మనుషులు రుషులవుతారు అన్న సిని కవి చెప్పిన విధంగా ప్రతీ ఒక్కరు తాము పని చేస్తున్న సంస్థల్లో కార్యాలయాల్లో, వ్యాపార ప్రదేశాలలో, ఇంటి ఆవరణలో మొక్కలు పెంచుకుంటే అందంతో పాటు ఆహ్లాదం లభిస్తుందని పరిశీలకులు అంటున్నారు. ఏది ఏమైనా ప్రభుత్వం చేపట్టిన హారితహారం కార్యక్రమం ద్వారా ప్రజల్లో చైతన్యం కలిగి పచ్చదనం పెంపకానికి శ్రీకారం చుట్టడం అభినందనీయం.

చోరీ సొత్తు పాత సామగ్రి దుకాణాల్లోకి..


మండలంలోని పాత సామగ్రి కొనుగోలు దుకాణం

● పాత సామాగ్రి దుకాణాల వైపు పోలీసుల చూపు

బోథ్, మే 13 (ఆంధ్రజ్యోతి): పాత సామాగ్రి దుకాణాలు కొంతమంది దొంగలకు విక్రయ అడ్డాలుగా మారాయి. రోజురోజుకు పాత సామగ్రి దుకాణాలు నూతనంగా వెలుస్తుండడంతో దొంగతనం చేసిన సామగ్రి పాత సామగ్రి దుకాణాల్లో అమ్ముతున్నారు అన్న సమాచారంతో పోలీసులు జిల్లా వ్యాప్తంగా దాడులు చేయడం జరిగింది. అయితే పాత సామాగ్రి దుకాణాల్లో అక్రమంగా కొనుగోలు చేసిన సామాగ్రి దొరకడంతో జిల్లాలోని పలు దుకాణాలపై కేసులు నమోదు చేసినట్లు జిల్లా ఎస్పీ ప్రకటించడం జరిగింది.

● పాత వాహనాల సామాగ్రి అంతా ఇక్కడే

వాహనాలను దొంగలించిన వారు పాత సామగ్రి దుకాణాలలో విక్రయిస్తున్నారన్న పక్క సమాచారంతో పోలీసులు ఈ దుకాణాల పైన దృష్టి పెట్టారు. గతంలో సోనాల మండల కేంద్రంలోని గ్రామపంచాయతీలో నిల్వ ఉంచిన ఆర్డబ్ల్యూఎస్ పైపులైన్‌కు సంబంధించిన విలువైన సామాగ్రిని దొంగిలించి పాత సామగ్రి దుకాణాలలో విక్రయించారని పోలీసులు తనిఖీలు చేయడం జరిగింది. అయితే కొంత సామాగ్రి పొరుగునే ఉన్న మహారాష్ట్రలోని పాత సామాగ్రి కొనుగోలు దుకాణంలో కొంత లభించినట్లు సమా చారం. అంతేగాక వివిధ ప్రాంతాల్లో దొంగతనం చేసి తీసుకు వచ్చిన ద్వి చక్ర వాహనాలతో పాటు రైతులు తమ పంట పొలాలలో అమర్చుకునే సో లార్ ప్లేట్లు విద్యుత్ మోటార్లకు సంబంధించిన వైరు పాత సామగ్రి దుకా ణాల్లో విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందుతున్నది. దీంతో పో లీసులు పాత సామాను దుకాణదారులకు అటువంటి సామాగ్రిని కొన వద్దని ఆదేశాలు ఇచ్చారు.

● నిబంధనలకు విరుద్ధంగా కొనుగోలు

పాత వాహనాల కొనుగోలు నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్నాయి. వాహనాల విక్రయదారులు పాత వాహనాలను థిస్ మెటల్ చేయిస్తున్నట్లు సంబంధిత ఆర్టీవో ఆఫీసులలో సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. అలా చేయకుండా వాహనాలను విక్రయిస్తే ఆర్టీవో రికార్డుల్లో వాహనాలు ఉన్నట్లు ఉంటుంది. అంతేగాక సదరు యజమాని మరో కొత్త వాహనం కొనాలంటే ఆయన పేరున రికార్డులో ఉన్న వాహనం సదరు వ్యక్తికి వాహనం ఉన్నట్లు రికార్డులు ఉండడం వల్ల అదనంగా మరో రెండు వేల రూపాయలు చెల్లించాల్సి వస్తుంది. ఈ విషయాన్ని తెలియక కొంతమంది పాత సామగ్రి కొనదారులకు విక్రయిస్తున్నారు. దొంగతనంగా తీసుకువచ్చి న వాహనాలను తక్కువ ధరలకు కొనుగోలు చేసి వాటి విడిభాగాలను తిరిగి విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపణలు వస్తున్నాయి. అధికారులు పాత సామగ్రి దుకాణాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

తాంసి మండలంలో విష జ్వరాలు

తాంసి, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో వ్యాధుల తీవ్రత రోజురోజుకు పెరుగుతుంది. వాతావరణ పరిస్థితుల ప్రభావమో లేక తాగునీటి కలుషితమో తెలియదు గాని మండలంలోని చాలా గ్రామాల్లో రోగులు మంచం పట్టారు. దినం పూట ఎండ.. చీకటి పడిందంటే చలి ఉండటం వల్ల జనం వ్యాధుల భారిన పడుతున్నారేమోనని పలువురు పేర్కొంటున్నారు. గ్రామాల్లో దోమల మందు స్ప్రే చేయకపోవడం, చెత్తాచెదారం పేరుకు పోయి ఉండటంతో కూడా దోమల తీవ్రత ఎక్కువై రోగాలు వ్యాపిస్తున్నాయని అంటున్నారు. ముఖ్యంగా కీళ్లు, కాళ్ల నొప్పులతో పాటు వాంతులు, విరోచనాలు చేసుకుంటున్నారు. ఇటీవల గిరిగావ్ గ్రామంలో ఒకరు డెంగీతో మంచం పట్టారు. చాలామంది గొంతు, కీళ్ల నొప్పులతో బాధపడుతున్నారు. నొప్పి అధికం కావడంతో స్థానికంగా ఉండే ఆర్ఎంపీల వద్ద సామాన్య జనం చికిత్సలు చేయించుకుంటున్నారు. మండల కేంద్రంలో ఆరోగ్య కేంద్రం ఉన్నప్పటికీ వంటి పూట మాత్రమే పనిచేస్తుం డటంతో రోగులు పూర్తిస్థాయిలో వైద్యాన్ని సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు.

● ఆర్ఎంపీలకు పెరిగిన గిరాకీ

గత కొద్దిరోజుల నుంచి వ్యాధుల తీవ్రత ఎక్కువ కావడంతో ఆర్ఎంపీ వైద్యులకు గిరాకీ పెరిగింది. తాంసి మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కపర్ల, గిరిగావ్, బండల నాగపూర్, పొన్నారి గ్రామాల్లో ఉప కేంద్రాలు ఉన్నప్పటికీ వైద్య సేవలు సకాలంలో అందక పోవడంతో చాలామంది రోగులు ఆర్ఎంపీ వైద్యాన్ని చేయించుకుంటున్నారు.






కర్రలతో నిర్మించిన అద్భుతమైన మహాంకాళి ఆలయం

ఫొటో న్యూస్

అద్భుతం.. కళాఖండం



ఇసుక లేదు.. సిమెంట్ లేదు.. తాపీ మేస్త్రీ లేరు.. ఆదివాసీ మహారాజ్ ఆర్కి టెక్చరయ్యారు. వడ్రంగులే కళాకారులయ్యారు. ఆదివాసీ మహారాజ్ కర్రలతో మహాంకాళి ఆలయాన్ని నిర్మిం చారు. ఈ అద్భుతమైన కళాఖండమే నేపాల్‌లోని పశు పతి ఆలయాన్ని మరిపిస్తోంది. ఆలయంలోని అమ్మవారి రూపాలు అందరిని ఆకట్టుకుంటున్నాయి. అమ్మవారే కళ్లముందు కదులుతున్నా అనుభూతి కలుగుతుందంటున్నారు భక్తులు. మహాంకాళి అమ్మవారే స్వప్నంలో చెప్పారు. అందుకే టేకు కర్రలతో ఆలయం నిర్మించామంటున్నారు ఆదివాసీ మహారాజ్ శంభుస్వామి. ఆదిలాబాద్ జిల్లా వాయిపేటలో కర్రలతో నిర్మించిన అద్భుతమైన ఆలయం.


● (ఆంధ్రజ్యోతి, ఆదిలాబాద్ స్టాఫ్ ఫొటోగ్రాఫర్)












డ్రైవర్‌ను అభినందించిన డీఎం

నిర్మల్ కల్చరల్, మే 13 (ఆంధ్రజ్యోతి) : బస్సులో ఓ ప్రయాణికుడు ఫోన్ మరచి పోగా అతనికి నిజాయితీతో అందించిన డ్రైవర్ సుమన్‌ను మంగళవారం డీఎం పండరి అభినందించారు. నిర్మల్ నుండి ఒంగోలు వెళ్తుండగా వరంగల్‌లో బస్సు ఎక్కి ప్రయాణికుడు విజయవాడలో దిగిర బస్సులో ఫోన్ మరచిపోయాడు. డ్రైవర్‌కు ఫోన్ చేయగా బస్సులో దొరికిన ఫోన్ తిరిగు ప్రయాణంలో అతనికి విజయవాడలో అప్పగించాడు.



ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలపై చర్య తీసుకోవాలని వినతి

నిర్మల్‌కల్చరల్, మే 13 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ పట్టణంలో ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలు అధిక వడ్డీలకు అప్పులు ఇచ్చి వేధిస్తున్నారని, వాటిపై చర్య తీసుకోవాలని కలెక్టర్‌కు శాంతినగర్ వాసులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. లైసెన్స్‌లు లేకుండా వ్యాపారాలు చేస్తూ ఆర్థికంగా వేధిస్తున్నారని వారు ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు. మానసికక్షోభ అనుభవిస్తూ తమ కుటుంబాలు వీధిన పడుతున్నాయన్నారు. చట్టపరమైన చర్య తీసుకోవాలని వారు కోరారు.



44వ జాతీయ రహదారికి అనుకొని ఉన్న తాండ్ర గ్రామం ఇదే..


విద్యుత్ సౌకర్యానికి నోచుకోని పెంబి మండలంలోని మారుమూల గిరిజన గ్రామం


దీపాల వెలుగులో చదువుకుంటున్న విద్యార్థులు

- జిల్లాలోని మారుమూల పల్లెల్లో చీకట్లకు ఇక చెల్లు
- 43 గ్రామాలకు కరెంట్ సౌకర్యం
- తాజాగా ప్రతిపాదనలు రూపొందించిన ఎన్పీడీసీఎల్
- ప్రతిపాదనలకు మోక్షం లభిస్తే త్వరలోనే పనులు షురూ

గిరిజన పల్లెలకు.. వెలుగులు!

నిర్మల్, మే 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని మారుమూల గిరిజన పల్లెల్లో తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్యం, కరెంట్ సౌకర్యంతో పాటు విద్య, వైద్యం, పౌష్టికాహారం సరఫరా లాంటి పథకాలను అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేయబోనున్న పీఎం జుగా (ప్రధాన మంత్రి జన్ జాతీయ ఉన్నత్ గ్రామ్ అభియాన్) పథకంతో ఇక్కడి మారుమూల గిరిజన పల్లెలకు మహర్దశ పట్టబోనుంది. ఇప్పటి వరకు జిల్లాలోని పెంబి, కడెం మండలాల్లోని 16 గ్రామాలకు కరెంట్ సౌకర్యం లేకపోవడంతో అక్కడి గిరిజనులంతా అంధకారంలోనే మగ్గుతున్నారు. ఆధునిక యుగం రాకెట్ వేగంతో దూసుకుపోతున్నప్పటికీ ఇక్కడి మారుమూల గిరిజనుల పరిస్థితి మాత్రం దయనీయంగా ఉంది. కాగా ఈ మారుమూల గిరిజన గ్రామాలన్నీ కవ్వాల్ అభయారణ్యం పరిధిలో ఉన్నందున కరెంట్ సరఫరా కోసం అవసరమయ్యే విద్యుత్ స్తంభాల ఏర్పాటు, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, విద్యుత్ లైన్ల ఏర్పాటుకు అటవీ, పర్యావరణ శాఖ అనుమతులు ఏళ్ల నుంచి లభించడం లేదు. కవ్వాల్ అభయారణ్యం నిబంధనలు అడ్డు తగులుతుండడంతో ఈ గ్రామాలకు కరెంట్ సౌకర్యాన్ని ఇప్పటి వరకు కల్పించలేకపోతున్నారు. అయితే ఇందులో నుంచి నాలుగైదు గ్రామాలకు ఇప్పటి వరకు సౌకర్యాన్ని కల్పించకపోగా మరికొన్ని గ్రామాలకు మాత్రం కేవలం సింగిల్ ఫేస్‌తో మాత్రమే కరెంట్ సరఫరా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేయబోతున్న పీఎం జుగా పథకంతో అటవీ పర్యావరణ శాఖ అనుమతులకు గ్రీన్ సిగ్నల్ లభించే అవకాశాలు ఉన్నాయంటున్నారు, పీఎం జుగా పథకం మారుమూల పల్లెల్లో మౌలిక సౌకర్యాలు కల్పించే లక్ష్యంతో చేపడుతున్నందున అటవీ, పర్యావరణ శాఖ అనుమతుల విషయంలో సడెన్ సడలింపులు ఉంటాయని భావిస్తున్నారు. దీనికి అనుగుణంగా ఇతర శాఖల కన్నా ముందుగా విద్యుత్ శాఖ మారుమూల గిరిజన పల్లెల్లో కరెంట్ సౌకర్యాన్ని కల్పించేందుకు ప్రతిపాదనలు రూపొందించడం ప్రాధాన్యతను సంతరించుకుంటుంది. మారుమూల గిరిజన పల్లెలతో పాటు మరికొన్ని వెనుకబడ్డ గిరిజన గ్రామాలను ఇక్కడి ఎన్పీడీసీఎల్ అధికారులు ఎంపిక చేశారు.

43 గ్రామాలకు ఇక చీకట్లు దూరం

కాగా నిర్మల్ జిల్లాలో కరెంట్ సౌకర్యం లేని మూడు గ్రామాలతో పాటు మరో 40 మారుమూల గిరిజన గ్రామాలను ఇక్కడి ఎన్పీడీసీఎల్ అధికారులు పీఎం జుగా పథకం కోసం ఎంపిక చేసి ఆ గ్రామాల్లో సౌకర్యాలకు సంబంధించి ప్రతిపాద నలు రూపొందించారు. పెంబి మండలంలోని గుమ్మెన, ఎంగ్లాపూర్, ఇటిక్యాల్, మందపల్లి, పసుపుల, పెంబి, శెట్‌పల్లి, దొందారి, కోసగుట్ట, వాస్‌పల్లి, వెంకం పోచంపాడ్, పెదరాగి దుబ్బ, కడెం మండలంలోని మిద్దె చింత, గంగాపూర్ గ్రామాలతో పాటు దిలావర్‌పూర్ మండలంలోని మాడెగాం, మామడ మండలంలోని రాసిమెట్ల, కిషన్‌రావుపేట్, రాయదారి, తాంద్ర, నిర్మల్ రూరల్ మండలంలోని రాణాపూర్, సారంగాపూర్ మండలంలోని కుప్టి, నాగపూర్, నర్సాపూర్ మండలంలోని బూరుగుపల్లి, కుబీర్ మండలంలోని డోడర్నా, శివాని, బ్రహ్మేశ్వర్, రంజని, మర్లగొండ, సిర్పల్లి, తానూర్ మండలంలోని మసల్గా, కోలూరు తండా, జరి తండా, లోకేశ్వరం మండలంలోని నర్సింహ నగర్ తండా, సేవాలాల్ తండా, ముథోల్ మండలంలోని విట్టోలి తండా, ఎడ్‌బిడ్ తండా, కుంటల మండలంలోని అంబకంటి తండా, దౌనెల్లి, బూరుగుపల్లి తండా గ్రామాలకు పూర్తి స్థాయిలో కరెంట్ సరఫరా చేసి ఆ గ్రామాల్లో వెలుగులు నింపేందు కోసం ఎన్పీడీసీఎల్ సంస్థ పీఎం జుగా కింద ప్రతిపాదనలు రూపొందించింది.

రాగి దుబ్బకు సౌర వెలుగులు

పెంబి మండలంలోని అత్యంత మారుమూల గిరిజన గ్రామమైన రాగి దుబ్బ గ్రామంలో సోలార్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి ఆ గ్రామంలో మొత్తం సోలార్ విద్యుత్‌ను సరఫరా చేయాలని అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. ఈ గ్రామానికి సాధారణ కరెంట్ సరఫరా చేయడం కష్టతరం కానున్నందున అధికారులు సోలార్ విద్యుత్‌ను ప్రత్యామ్నాయం చేయాలని అధికారులు భావిస్తున్నారు. ఇందులో భాగంగానే సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు అవసరమయ్యే చర్యలు చేపట్టాలని నిర్ణయించారు.


పాఠశాల గదిలో పీఏసీఎస్ సీఈవో ఆశన్న, సిబ్బందిని నిర్బంధించిన రైతులు

ధాన్యం కొనుగోళ్లలో అదనపు తూకంపై ఎర్వచింతల్ రైతుల ఆగ్రహం

ఖానాపూర్, మే 13 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోళ్లలో సెంటర్ నిర్వాహకుల చేతివాటంపై ఖానాపూర్ మండలం ఎర్వచింతల్ రైతులు కన్నెర్ర చేశారు. బస్తా ధాన్యం తూకం వేసే సమయంలో బస్తాకు 43 కిలోల ధాన్యాన్ని తూకం వేస్తామని సెంటర్ నిర్వాహకులు తెలపడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఉదయం సెంటర్ వద్దకు వచ్చిన ఖానాపూర్ పీఏసీఎస్ సీఈవో ఆశన్నను సెంటర్ వద్ద గల పాఠశాల గదిలో బంధించి తాళం వేశారు. అదనపు ధాన్యాన్ని తూకం వేస్తే సహించేది లేదంటూ రైతులు గది ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సదరు సీఈవో సహా పీఏసీఎస్ సిబ్బందిని రైతులు గదిలో నిర్బంధించడంతో ఎట్టకేలకు పీఏసీఎస్ అధికారులు దిగివచ్చారు. ఎర్వచింతల్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో బస్తాధాన్యం తూకం వేసేందుకు 42 కిలోల చొప్పున కొనుగోలు చేస్తామని లిఖిత పూర్వకహామీ ఇచ్చారు. రైతుల డిమాండ్ మేరకు ధాన్యం తూకంలో ఇకపై ఒక బస్తాకు 42 కిలోలకు మించి తూకం వేయమని పీఏసీఎస్ సీఈవో ఆశన్న లిఖితపూర్వకంగా హామీ ఇవ్వడంతో గది నుంచి విడుదల చేశారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో హమాలీ పేరిట సైతం దోపిడీకి పాల్పడుతున్నారని రైతులు మండిపడ్డారు. గత ఏడాది క్వింటాల్ ధాన్యం తూకం వేసినందుకు రూ.35 హమాలీ చెల్లిస్తే ఈ ఏడాది రూ.40 చెల్లించాలని చెబుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బీహార్ నుంచి హమాలీలను తక్కువ ధరకు తీసుకువచ్చి రైతుల వద్ద ఎక్కువ డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు.


కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులను సముదాయిస్తున్న పోలీసులు

రైతుల ఆందోళనకు రాజకీయ రంగు...

రైతులు ఆందోళన చేస్తున్న సమయంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్దకు కాంగ్రెస్ నాయకులు చేరుకోవడంతో కొంత ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. రైతులకు మద్దతుగా బీఆర్ఎస్ మండల నాయకులు, ఎర్వచింతల్ మాజీ సర్పంచ్ కొడారి గోపాల్ ఆందోళనలో పాల్గొన్నారు. ధాన్యం తూకంలో జరుగుతున్న మోసంపై అధికారులను గోపాల్ నిలదీస్తున్న సమయంలో అక్కడికి వచ్చిన అతని తమ్ముడు కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు కొడారి నరేష్‌కు మధ్య మాట మాట పెరిగింది. అప్పటి వరకు రైతులు వర్సెస్ పీఏసీఎస్ అధికారులుగా సాగిన వివాదం కాస్త బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల పంచాయతీగా మా రింది. ఒక దశలో ఇరు వర్గాలు కొట్టుకునేందుకు సిద్ధమయ్యారు. అదే సమయంలో అక్కడికి వచ్చిన పోలీసులు ఇరువర్గాలను సముదాయించారు. తమను ఇబ్బంది పెట్టవద్దని సామాన్య రైతులు అభిప్రా యపడ్డారు. కాగా తాను కూడా రైతులకు మద్దతుగా మాట్లాడేందుకే సెంటర్ వద్దకు వచ్చినట్లు కాంగ్రెస్ నాయకులు నరేష్ తెలిపారు. అదనంగా ధాన్యాన్ని తూకం వేసి రైతులకు ఇబ్బంది గురి చేస్తే సహించేది లేదన్నారు. పోలీసులు సము దాయించడంతో ఇరువర్గాలు అక్కడి నుంచి వెళ్లిపోయాయి.

సీఈవో తీరుపై రైతుల ఆగ్రహం...

ఎర్వచింతల్‌లో సీఈవో ఆశన్నను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ అతడిని గదిలో బంధించి గది ఎదుట రైతులు ఆందోళనకు దిగారు. రైతుల ఆందోళనతో దిగి వచ్చిన సీఈవో లిఖితపూర్వకంగా అదనపు ధాన్యం తూకం వేయనని రైతులకు రాసి ఇచ్చి అక్కడి నుంచి మెల్లగా జారుకున్నట్లు రైతులు చెబుతున్నారు. ఈ వివాదంతో ఎర్వచింతల్ వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నిర్మల్ డీసీవో పాపయ్య సందర్శించారు. పీఏసీఎస్ సీఈవో ఆశన్నకు షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు తెలిపారు. నోటీసు తదనంతరం శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. రైతులకు ఇబ్బంది కలుగకుండా చర్యలు చేపడతామని డీసీవో సూచించారు.


లిఖిత పూర్వక హామీని డీసీవోకు చదివి వినిపిస్తున్న మాజీ సర్పంచ్ గోపాల్

బోధన నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలి

- డీఈవో రామారావు


మాట్లాడుతున్న డీఈవో రామారావు

నిర్మల్‌కల్చరల్, మే 13 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులు తమ బోధన నైపుణ్యాలు ఎప్పటికప్పుడు మెరుగుపర్చుకోవాలని డీఈవో రామారావు సూచించారు. మంగళవారం నిర్మల్ పట్టణంలోని నారాయణ హైస్కూల్‌లో శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. డీఆర్పీలకు జూమ్ ద్వారా సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఉపాధ్యాయులు అన్ని రంగాల్లో విద్యార్థులను తీర్చిదిద్దాలని, మెరుగైన బోధన అందించాలన్నారు. దేశ భవిష్యత్ విద్యార్థుల చేతుల్లో ఉందని, అందుకు అనువైన బోధనకు శిక్షణలు దోహదం చేస్తాయన్నారు. శిక్షణ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అభ్యాసన ఫలితాలు, విభిన్న బోధన, డిజిటల్ బోధన, కృత్రిమ మేధ నూతన సాంకేతికత ఆధారంగా బోధన మెరుగుపర్చుకోవాలన్నారు. ఇంగ్లీష్, గణితం, సోషల్ తదితర విషయాలపై శిక్షణ నిర్వహిస్తారని వివరించారు. ఎఫ్ఏవో రహనారెడ్డి, ఏఎంసీ నర్సయ్య, సీఎంవో ప్రవీణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాల నిరోధక

చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

- అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

నిర్మల్ కల్చరల్, మే 13 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాల చట్టం 2006ను ఉల్లంఘించి వివాహాలు జరిపిస్తే కఠినచర్యలు ఉంటాయని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ తెలిపారు. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో బాల్య వివాహాలు జరిపించాలంటే పురుషులకు 21, స్త్రీకి 18 ఏళ్లు తప్పనిసరిగా పూర్తి కావాలన్నారు. బాల్యవివాహాలు నిరోధించేందుకు గ్రామ, మండల, డివిజన్, జిల్లాస్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాస్థాయిలో కలెక్టర్, డివిజన్‌స్థాయిలో ఆర్డీవో, మండల స్థాయిలో తహసీల్దార్లు, గ్రామస్థాయిలో కార్యదర్శులు, వీఆర్వోలతో పాటు ఐసీడీఎస్ సూపర్‌వైజర్, తదితరులను అధికారులుగా ప్రభుత్వం నియమించిందన్నారు. ఈ చట్టాన్ని ఉల్లంఘించి బాల్య వివాహాలకు సహకరించే పురోహితుడు, ఫంక్షన్ హాల్ యజమాని, క్యాటరింగ్ నిర్వాహకులు సహా తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు, సహకరించిన వారికి శిక్ష పడుతుందన్నారు. గ్రామాల్లో సైతం బాల్య వివాహాలు నిరోధక పరిరక్షణ కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. వివాహాలకు సంబంధించిన వధూవరుల పుట్టిన తేదీ, ఆధార్ కార్డు, స్వీయ ధ్రువీకరణలు సమర్పించాల్సి ఉంటుందన్నారు. బాల్య వివాహాలు జరిపించినట్లయితే చిల్డ్రన్ హెల్ప్ లైన్ నెంబర్ 1098కు సమాచారం అందించాలన్నారు. జిల్లాలోని తానూర్ మండలంలో 15 ఏళ్ల బాలికకు బాల్య వివాహం జరిపించేందుకు యత్నించిన వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, విజయవంతంగా అమలు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లాలోని అధికారులను ఆదేశించారు.

పేదలకు అండగా సీఎం రిలీఫ్ ఫండ్

- ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావ్ పాటిల్


చెక్కులు పంపిణీ చేస్తున్న ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్

భైంసా, మే 13 (ఆంధ్రజ్యోతి): వివిధ ఆరోగ్య సమస్యలతో కార్పొరేట్, ప్రైవేట్ ఆసుపత్రులలో చికిత్సలు నిర్వహించుకున్న పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి అండగా నిలుస్తోందని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ పేర్కొన్నారు. మంగళవారం భైంసాలోని తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని 48 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. వైద్య చికిత్సల కోసం చేసిన వ్యయభారాన్ని ,ఆర్థిక ఇబ్బందులను తొలగించేందుకు గాను సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా తోడ్పాటునిస్తున్నామని వివరించారు. నియోజక వర్గ పరిధిలో ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్య సేవలు మెరుగుపరచేందుకు బాధ్యతాయుతతో చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. భైంసా ఏరియా ఆసుపత్రిలో అధునిక వైద్య సేవలు అందుబాటులో తీసుకవచ్చేందుకు గాను ప్రణాళికబద్ధంగా వ్యవహరిస్తున్నామని తెలిపారు. ఇందులో బీజేపీ భైంసా మండల అధ్యక్షురాలు సిరం సుష్మారెడ్డి, బీజేవైఎం డివిజన్ ప్రతినిధి గంగా ప్రసాద్ (వాలేగాం), సాయినాథ్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

కుంటాల : మండల కేంద్రం కుంటాలతో పాటు దౌనెల్లి గ్రామాలలో ఇటీవల పలు కారణాలతో మృతి చెందిన బాధిత కుటుంబాలను మంగళవారం ముథోల్ ఎమ్మెల్యే రామరావు పటేల్ పరామర్శించారు. ఈయన వెంట మాజీ ఎంపీపీ యాదవ్, నాయకులు రమణ రావు తదితరులున్నారు.

గంజాయి మొక్కలు పెంచితే కఠిన చర్యలు

- ఏఎస్పీ రాజేష్ మీనా

ఖానాపూర్, మే 13 (ఆంధ్రజ్యోతి) : గంజాయి మొక్కలు సాగుచేస్తే ఎంతటి వారైనా కఠినచర్యలు తప్పవని నిర్మల్ ఏఎస్పీ రాజేష్ మీనా హెచ్చరించారు. మంగళవారం నిర్మల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పెంబి మండలంలోని పోచంపల్లి, గోధుమల గ్రామాల్లో గంజాయి సాగుచేస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. వివరాల్లోకి వెళ్తే... ఏఎస్పీ రాజేష్ మీనా తెలిపిన కథనం ప్రకారం... ఈ నెల 12వ తేదీన పెంబి మండలంలోని పోంచపల్లి, గోధు మల గ్రామాల్లోని వ్యవసాయ భూమిలో గంజాయి మొక్కలను సాగు చేస్తున్నట్లు పెంబి ఎస్సై హను మండ్లుకు రహస్య సమాచారం అందింది. వెంటనే ఎస్సై విషయాన్ని ఎస్పీ దృష్టికి తీసుకువెళ్లారు. ఎస్పీ జానకి షర్మిల ఏఎస్పీ రాజేష్ మీనా నేతృత్వంలో ఎస్సై హనుమండ్లుతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయించారు. ఈ బృందం గ్రామాల్లో తనిఖీలు నిర్వహించగా చిన్న గోధుమల గ్రామంలో కొమురం దొండురావు వ్యవసాయ భూమిలో కూరగాయల చెట్ల మధ్యలో 14 గంజాయి మొక్కలను పెంచుతున్నట్లు గుర్తించారు. వీటి విలువ రూ.1.40 లక్షలు ఉంటుందని తెలిపారు. పోచంపల్లి గ్రామ శివారులో మేఘావత్ కైలాస్ వ్యవసాయ భూమిలో మొక్కజొన్న పంటకోసి ఉన్న భూమిలో రెండు గంజాయి మొక్కలను గుర్తించారు. ఈ రెండు గంజాయి మొక్కల విలువ రూ.20,000 ఉంటుందని ఏఎస్పీ తెలిపారు. గంజాయి మొక్కలను సాగు చేసి సులభంగా ఎక్కువ డబ్బులను సంపాదించాలనే ఉద్దేశంతో మూడునెలలుగా ఈ ఇద్దరు వ్యక్తులు గంజాయి మొక్కలను పెంచుతున్నట్లు పోలీసుల విచారణలో తేలిందన్నారు. వెంటనే వీరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏఎస్పీ తెలిపారు. కేసులో చాకచక్యంగా వ్యవహరించిన ఏఎస్పీ రాజేష్ మీనా, ఖానాపూర్ సీఐ సిహెచ్ అజయ్, పెంబి ఎస్సై హనుమండ్లు, ఇతర సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.


వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ రాజేష్ మీనా

నిర్మల్ కల్చరల్ : పట్టణంలోని బస్టాండ్ ప్రాంతంలో గంజాయి అమ్ముతున్నట్లు అందిన సమాచారం మేరకు మంగళవారం షైక్ నిజాముద్దీన్‌ను అరెస్ట్ చేసినట్లు ఏఎస్పీ రాజేష్ మీనా తెలిపారు. ఎస్సై సాదిక్ హుస్సేన్ ఆధ్వర్యంలో దాడి నిర్వహించారు. వివరాలు వెల్లడిస్తూ నిర్మల్ పట్టణం చిక్కుడపల్లికి చెం దిన నిందితుడిని విచారించగా నిజా మాబాద్ నుంచి గంజాయి తీసుకుని వచ్చి నిర్మల్‌లో అమ్మి సొమ్ము చేసు కుంటున్నాడని తెలిపారు. అతని వద్ద నుండి 200ల గ్రాముల గంజాయి, మొబైల్ స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

భైంసా : పట్టణ పరిధిలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను పట్టుకున్నట్లు భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్ తెలిపారు. మంగళవారం భైంసా టౌన్ సీఐ గోపినాథ్‌తో కలిసి ఎస్‌డీపీవో కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి గంజాయి విక్రయదారుల పట్టివేత కేసు వివరాలను వెల్లడించారు. మంగళవారం ఉదయం వేళలో భైంసా టౌన్ ఎస్ఐ జి.శ్రీనివాస్, రెవెన్యూ సిబ్బంది సంయుక్తంగా నిర్వహించిన దాడిలో నిషేధిత గంజాయి అమ్ముత్తున్న పట్టణ పరిధిలోని బంగాలగల్లికి చెందిన ముజాహిద్‌ఖాన్ (36), ఓవైసీనగర్ కాలనీకి చెందిన షేక్ అహ్మద్(36)లు పట్టుబడినట్లుగా వివరించారు. స్థానిక కడ్డా హోటల్ సమీపంలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ వెనుకవైపు భాగంలో వీరిద్దరిని పట్టుకున్నట్లుగా తెలిపారు. పోలీసు పెట్రోలింగ్ వాహనాన్ని చూసి పారిపోతుండగా అనుమానం వచ్చి వెంబడించి వీరిద్దరిని పట్టుకొని తనిఖీలు చేపట్టగా వారిద్దరి వద్ద 1.5 కేజీల ఎండు గంజాయి లభ్యమైనట్లుగా వివరించారు. నిందితులిద్దరిపై కేసుల నమోదు చేసి వారిద్దరి వద్ద గల నిషేదిత ఎండు గంజాయిని స్వాధీన పరుచుకున్నట్లుగా తెలిపారు.దాడుల్లో పోలీసు కానిస్టేబుళ్ల ప్రమోద్, క్రాంతి, శరత్, హరిబాబు, బాలాజీలు పాల్గొన్నట్లుగా పేర్కొన్నారు.